
www.prajasakti.com

ప్రజాశక్తి

బుధవారం 24 సెప్టెంబర్ 2025

5

తూర్పుగోదావరి




పెరటి తోటల పెంపకానికి విత్తనాలు

ప్రజాశక్తి-గోకవరం

ప్రకతి వ్యవసాయ సిబ్బంది ఆధ్వర్యంలో కామరాజుపేట, కొత్తపల్లి, రంపఎర్రంపాలెం, తిరుమలయపాలెం, గుమ్మలదొడ్డిలో పెరటి తోటల పెంపకానికి విత్తనాల పంపిణీకి ఏర్పాట్లు చేస్తున్నారు. ఆకుకూరలు, కూరగాయలు, ఆరోగ్యకరమైన విత్తనాల కొనుగోలు కోసం దాతల సహకారంతో భూమిలేని నిరుపేదలకు, ఇంటి వద్దే వీటిని ఇవ్వడానికి సిబ్బంది సిద్ధమవుతున్నారు. ప్రకతి వ్యవసాయం సాగు భూమిలేని కుటుంబాలకు ప్రకృతి వ్యవసాయ విధానంలో స్వర్ణాంధ్ర, స్వచ్ఛ ఆంధ్రలో భాగంగా భూమిలేని నిరుపేద కుటుంబాలకు సాస కిచెన్ గార్డెన్లో భాగంగా గోంగూర, పాలకూర, చుక్కకూర, మెంతుకూర, బెండ, చిక్కుడు, గోరుచిక్కుడు, కాకర, దోస, క్యారెట్, బీట్‌రూట్, బొబ్బరి మొదలైన విత్తనాలు ప్యాకింగ్ చేసినట్టు తెలిపారు.

ఛార్జీల మోత.. ప్రజలకు వాత..

- ఊపందుకున్న ఆన్‌లైన్ రిజర్వేషన్లు
- టికెట్ల ధరలు పెంచేసిన ప్రైవేట్ ఆపరేటర్లు
- ప్రత్యేక సర్వీసులు ప్రకటించని ఆర్‌టిసి



ప్రజాశక్తి - రాజమహేంద్రవరం ప్రతినిధి

దసరా పండుగ రద్దీ ప్రయాణికుల జేబులకు చిల్లు పెడుతోంది. ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు యాజమాన్యాలు ప్రజల ప్రయాణ అవసరాలను అవకాశంగా తీసుకొని యథేచ్ఛగా నిలువు దోపిడీ చేస్తున్నాయి. ఉపాధి కోసం ఇతర పట్టణాల్లో స్థిరపడిన జిల్లా వాసులు పండుగల నేపథ్యంలో తిరిగి తమ స్వస్థలాలకు రావడం పరిపాటి. కుటుంబ సభ్యుల రాకతో ప్రతి ఇంటిలోనూ పండుగ సంబరాలు దర్శనమిస్తుంటాయి. ఈ నేపథ్యంలో ఆన్‌లైన్ రిజర్వేషన్‌లు ఊపందుకున్నాయి. ఇప్పటికే రైళ్ల రిజర్వేషన్స్ ఖాళీలు లేవు. ఆర్‌టిసి ప్రత్యేక సర్వీసులు ఇప్పటికీ ప్రకటించలేదు. అందుబాటులో ఉన్న సర్వీసులకు రిజర్వేషన్లు ఇప్పటికే భర్తీ అయిపోయాయి. ప్రత్యేక సర్వీసులు ప్రకటిస్తే మరోసారి రిజర్వేషన్ చేయించుకునే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో ప్రైవేట్ బస్సుల్లో రిజర్వేషన్ల కోసం ప్రయాణికులు ఆపరేటర్లను ఆశ్రయిస్తున్నారు. జిల్లా కేంద్రమైన రాజమహేంద్రవరంలో సుమారు 80 మంది ప్రైవేట్ ఆపరేటర్లు ఉన్నారు. విశాఖపట్నం, హైదరాబాద్, బెంగళూరు తదితర ముఖ్య పట్టణాలకు బస్సుల రాకపోకలకు టికెట్లను విక్రయిస్తుంటారు. ఈ బస్సులన్నీ కాంట్రాక్టు క్యారేజీ కావటంతో ఫిక్స్‌డ్ ఛార్జీల నిబంధనలు వర్తించవు. దీంతో డిమాండ్ ఆధారంగా ప్రైవేట్ ఆపరేటర్లు ధరలు పెంచేశారు. ప్రైవేట్ బస్సుల ఆపరేటర్లపై పర్యవేక్షణ కొరవడడంతో ప్రయాణికుల జేబులకు చిల్లు పడుతోంది. ఈ నెల 25వ తేదీ నుంచి అక్టోబరు 5వ తేదీ వరకూ రిజర్వేషన్‌ల ధరలు ఒక్కసారిగా పెరిగిపోయాయి. హైదరాబాద్ నుంచి రాజమహేంద్రవరం-కాకినాడకు సాధారణ ఛార్జీలు రూ.750 కాగా ప్రస్తుతం రూ.1500కు చేరాయి. స్లీపర్ రూ.1000 నుంచి ఒక్కసారిగా రూ.2000కు చేరింది. ఎసి స్లీపర్ రూ.3000 నుంచి రూ.4500 పైమాటే. రాజమహేంద్రవరం నుంచి విజయవాడకు ఆర్‌టిసి ఛార్జీ రూ.350 కాగా ప్రైవేటు బస్సులకు రూ.1000 చెల్లించాల్సి వస్తోంది. రాజమహేంద్రవరం నుంచి విశాఖ పట్టణానికి ఆర్‌టిసి ఛార్జీలు రూ.440 కాగా ప్రైవేట్ ట్రావెల్స్ రూ.1500 వసూలు చేస్తున్నాయి. ఒక్కొక్క టికెట్లు ధరకు అదనంగా మూడు రెట్లు వసూలు జరగడంతో ఒక కుటుంబంపై రూ.5 వేల నుంచి రూ.7 వేల వరకు భారం పడుతుంది. ఎసి స్లీపర్ బస్సులకు రూ.10 వేల వరకూ అదనపు భారం పడుతోంది. ఛార్జీల నియంత్రణకు చర్యలుచేపట్టాలని ప్రయాణికులు విజ్ఞప్తి చేస్తున్నారు. ఆర్‌టిసి సర్వీసులపై ప్రకటన చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

ఎసి స్లీపర్ రిజర్వేషన్‌కు రూ.3500

ఎసి స్లీపర్ ఒకొక్క టికెట్టుకు రూ.3500 డిమాండ్ చేస్తున్నారు. సాధారణ రోజులలో ఈ టికెట్టు ధర రూ.700 మాత్రమే. ఒక్కసారిగా రూ.1300 పెంచారు. ఈ నెల 25న మా కుటుంబ సభ్యులకు హైద్రాబాద్ నుంచి రాజమహేంద్రవరానికి టికెట్లు బుక్ చేశాను. మరో నాలుగు రోజులు ఆగితే టికెట్లు దొరకవని హెచ్చరించడంతో అధిక ధర అయినప్పటికీ కొనుగోలు చేయక తప్పలేదు. నాలుగు టికెట్లపై రూ.5200 భారం పడింది.

- సిహెచ్.రాఘవేంద్రరావు, ఆర్యాపురం విశ్రాంత ఉద్యోగి.



తాళ్లపూడిలో ఆందోళన చేస్తున్న ఉద్యోగులు

సచివాలయ ఉద్యోగుల నిరసన

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం, తాళ్లపూడి

ఎపి సచివాలయ ఉద్యోగుల జెఎసి పిలుపు మేరకు మంగళవారం నుంచి సచివాలయ ఉద్యోగులు నల్ల రిబ్బన్లు ధరించి ఆందోళన చేపట్టారు. రాజమహేంద్రవరంలోని జిల్లా కలెక్టర్ కార్యాలయ ఆవరణలో సంఘ కార్యదర్శుల సమావేశం జిల్లా ఛైర్మన్ వరసాల రామదాసు అధ్యక్షతన నిర్వహించారు. ఉద్యోగులను మాతృ శాఖలకు పంపించాలని, జూనియర్ అసిస్టెంట్ స్కేల్ అమలు చేయాలని, నోషనల్ ఇంక్రిమెంట్లు ఇవ్వాలని, ప్రభుత్వ సెలవు దినాలలో బలవంతపు పనులు అప్పగించరాదని, ఉద్యోగుల ఇంటింటి సర్వే పేరుతో వేధింపులు నిలిపివేయాలని, ఆత్మగౌరవం కాపాడాలని డిమాండ్ చేశారు. జిల్లాలోని సుమారు 4600 మంది సచివాలయ ఉద్యోగులు నేటి ఆందోళనలో పాల్గొన్నట్టు తెలిపారు. కన్వీనర్ కె.సుధాకర్, కో చైర్మన్ షేక్ గౌసియా బేగం, కో-కన్వీనర్ కె.బాల రజని, ఎపి ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు పి.గిరి ప్రసాద్ ప్రసాద్ వర్మ పాల్గొన్నారు.

తాళ్లపూడి వాలంటీర్లు నిర్వహించే అనేక విధులను సచివాలయ ఉద్యోగులపై భారం మోపడాన్ని నిరసిస్తూ ఆ శాఖ ఉద్యోగులు మంగళవారం నల్ల బ్యాడ్జీలు ధరించి విధులకు హాజరయ్యారు. ఈ క్రమంలో ఆయా కార్యాలయాల ఎదుట కొద్దిసేపు నిరసన వ్యక్తం చేశారు. పలువురు ఉద్యోగులు మాట్లాడుతూ దశలవారీ పోరాటంలో భాగంగా ఈరోజు నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపామని అన్నారు.

గౌరవ్‌ను కలిసిన ఎపిజిఇఎ నేతలు

ప్రజాశక్తి-కడియం

ఇటీవల నూతనంగా బాధ్యతలు స్వీకరించిన రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ ముఖ్య కార్యదర్శి గౌరవ్ సార్‌ను తాడేపల్లి సచివాలయంలోని ఆయన ఛాంబర్‌లో రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు కె.ఆర్.సూర్యనారాయణ, ఎం.రమేష్ కుమార్ ఆధ్వర్యంలో జిల్లా కార్యదర్శి సిహెచ్.విల్సన్ పాల్, వైద్య ఆరోగ్య శాఖ నాయకులు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. వైద్య ఆరోగ్య శాఖ ఉద్యోగులు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలైన జిఒ 143 రద్దు చేయాలని, పని ఒత్తిడి తగ్గించాలని, ప్రమోషన్లు కల్పించాలని, ఉద్యోగ నియామకాలు చేపట్టి ఖాళీలను భర్తీ చేయాలని, తొలగించిన మేల్ హెల్త్ అసిస్టెంట్లను విధులలోనికి తీసు కోవాలని, ఎఫ్‌ఆర్‌ఎస్ విధానం రద్దు చేయాలని కోరారు. వీటిపై చర్చించి సమస్యలు పరిష్కరిస్తామని ఆయన హామీ ఇచ్చినట్లు ఉద్యోగ సంఘ నాయకులు తెలిపారు.



ముఖ్య కార్యదర్శిని కలిసిన ఉద్యోగ సంఘ నాయకులు

నల్లజర్లకు పెద్దాసుపత్రిపై హర్షం

ప్రజాశక్తి - నల్లజర్ల

నల్లజర్లకు పెద్దాసుపత్రి రానుండడం తమకెంతో సంతోషాన్ని కలిగిస్తోందని పిహెచ్‌సి సిబ్బంది తెలిపారు. నల్లజర్లకు ప్రభుత్వ పెద్దాసుపత్రి అత్యంత ఆవశ్యమని గుర్తించిన స్థానిక ఎంఎల్‌ఎ మద్దిపాటి వెంకటరాజు ఇప్పటికే నల్లజర్లకు 30 పడకల పెద్దాసుపత్రితో పాటు అత్యవసర వైద్యానికి అవసరమైన అత్యాధునిక ట్రామాకేర్ సెంటర్‌ను తీసుకొస్తున్న విషయం ఈ సందర్భంగా ఉద్యోగులు స్పందించారు. గ్రామీణ ప్రాంతానికి ముఖద్వారంగా, పల్లెలకు ఆయువుపట్టుగా ఉన్న నల్లజర్లలో ప్రస్తుతం అందుబాటులో వున్న ప్రాథమిక వైద్యాన్ని మెరుగ్గా అందించేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. పిహెచ్‌సి వైద్యులు డాక్టర్ తెల్లం గంగాధరరావు, డాక్టర్ మహ్మద్ సిరాజ్ ఉద్దీన్, సిహెచ్‌ఒ నేమాని వెంకటశాస్త్రి, వైద్య ఉద్యోగులు సంఘం నాయకులు జివివి.ప్రసాద్, వైద్య ఉద్యోగులు పాల్గొన్నారు.

కుంచాల కైవల్యకు ఘన సత్కారం

ప్రజాశక్తి-నిడదవోలు

జర్మనీ నిర్వహించే ఇంటర్నేషనల్ ఆస్ట్రానమీ అండ్ ఆస్ట్రోఫిజిక్స్ కాంపిటీషన్‌లో నిడదవోలుకు చెందిన కైవల్య రెడ్డి కుంచాల ఫైనల్ రౌండ్ పూర్తిచేసుకుని సిల్వర్ హానర్ సర్టిఫికెట్ అందుకున్న సందర్భంగా కొవ్వూరు డిఎల్‌పిఒ ఎ.స్లేవారెడ్డి, ఎంపిడిఒ జెవివియల్.జగన్నాథం మంగళవారం ఆమెను అభినందించారు. జర్మనీకి చెందిన అంతర్జాతీయ ఖగోళ శాస్త్ర, ఖగోళ భౌతిక శాస్త్ర సంస్థ నిర్వహించే ఈ పోటీలో 120 దేశాలకు చెందిన వేలాది మంది విద్యార్థులు పాల్గొన్నారు. మూడు దశలలో నిర్వహించే ఈ పోటీలో మొదటి రెండు రౌండ్‌లలో కటాఫ్ మార్కులు సాధించిన కైవల్య ఫైనల్ రౌండ్‌కు అర్హత సాధించారు.



కైవల్యను సత్కరిస్తున్న డిఎల్‌పిఒ, ఎంపిడిఒ



బిక్కవోలులో శిబిరంలో పాల్గొన్న సిబ్బంది

మహిళలకు వైద్య పరీక్షలు

ప్రజాశక్తి - ఉండ్రాజవరం, బిక్కవోలు

మహిళలు ఆరోగ్యంపై శ్రద్ధ వహించి, పోషకాహారం తీసుకోవాలని పిహెచ్‌సి డాక్టర్ ఆర్.ఉషాదేవి అన్నారు. మంగళవారం ఉండ్రాజవరంలో నిర్వహిస్తున్న స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన వైద్య శిబిరాలు ఉపయోగించుకోవాలని సూచించారు. సీనియర్ టిబి ట్రీట్మెంట్ సూపర్వైజర్ ఆశాజ్యోతి మాట్లాడుతూ ప్రజలు క్షయ వ్యాధి పట్ల అవగాహన కలిగి ఉండాలని, మధుమేహం, బరువు తక్కువగా ఉండి, 60 ఏళ్ల వయసు పైబడిన హెచ్‌ఐవి వ్యాధిగ్రస్తులు తప్పనిసరిగా టిబి పరీక్షలు చేయించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిహెచ్‌ఎస్ శ్రీరామ్మూర్తి, ఎంఎల్‌హెచ్‌పి టి.పూజశ్రీ దుర్గ, ఎఎన్‌ఎం దుర్గా మల్లేశ్వరి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

బిక్కవోలు కొంకుదురు పిహెచ్‌సి వైద్యాధికారి, డాక్టర్ జి.విజయలక్ష్మి పందలపాకలో సచివాలయం-1 వద్ద 126 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. వారికి మందులు పంపిణీ చేశారు. ఉప్పు, కారం, నూనె వంటి పదార్థాలను సాధ్యమైనంత తక్కువగా వంటల్లో వినియోగించాలని సూచించారు. పడాల వెంకటరామారెడ్డి, సర్పంచ్ సబ్బవరపు పద్మావతి, చౌదరి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కార్టూ'నిజం'



నివాస ప్రాంతాల్లో బార్

పి4 సంధానకర్తలుగా వ్యవహరించాలి

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం, గోపాలపురం

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలుచేస్తున్న పి-4 కార్యక్రమం అమలులో వార్డు సచివాలయ ఉద్యోగుల పాత్ర ఎంతో కీలకమని అదనపు కమిషనర్ పివి.రామలింగేశ్వర్ పేర్కొన్నారు. జీరో పావర్టీ లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన ఈ విధానం అమలుపై ఆనం కళాకేంద్రంలో వార్డు సచివాలయ కార్యదర్శులకు మంగళవారం శిక్షణా తరగతులు నిర్వహించారు. 2047 నాటికి విజన్ స్వర్ణాంధ్ర సాధన కోసం నిర్దేశించిన పది లక్ష్యాల్లో భాగంగా పేదరికం లేని సమాజాన్ని నిర్మించేందుకు రాష్ట్ర ప్రభుత్వం పి4 కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని అదనపు కమిషనర్ తెలిపారు. దీని ద్వారా సమాజంలో ఆర్థిక అసమానతలు తొలగించేందుకు వీలు కలుగుతుందన్నారు. బంగారు కుటుంబాలు, మార్గదర్శులకు సంధానకర్తలుగా సచివాలయ ఉద్యోగులు వ్యవహరిస్తారని చెప్పారు. ఇందులో భాగంగా మార్గదర్శకులు, బంగారు కుటుంబాలతో ముందుగా సమావేశం ఏర్పాటు చేసి అనుసంధానం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సెక్రటరీ జి.శైలజ వల్లి, ఎఎస్‌ఒ కె.ప్రసాద్, డిప్యూటీ స్టాటిస్టికల్ ఆఫీసర్ ఎఎస్‌వి.హరికృష్ణ, యంగ్ ప్రొఫెషనల్ కె.దుర్గా భవాని, వార్డు సచివాలయాల కార్యదర్శులు పాల్గొన్నారు.

గోపాలపురం అట్టడుగున ఉన్న పేదల సమస్యలను పరిష్కరించేందుకు సచివాలయ సిబ్బంది కృషి చేయాలని ఇన్‌ఛార్జి ఎంఇపిడిఒ ఆర్.సుజాత, ఎఎస్‌ఒ జోడాల వెంకటేశ్వరరావు అన్నారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ సమావేశపు హాల్లో గ్రామ సచివాలయ సిబ్బందికి పి-4 కార్యక్రమంపై ఒక రోజు శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అట్టడుగున ఉన్న పేదలను ఆదుకోవడమే పి-4 పథకం ముఖ్య ఉద్దేశమన్నారు. మండలంలో 18 గ్రామ పంచాయతీల పరిధిలో 3,445 మంది నిరుపేదలను గుర్తించినట్లు తెలిపారు. 151 మంది సచివాలయ సిబ్బందికి వారి బాధ్యతలను అప్పగించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అనిల్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



గోపాలపురంలో శిక్షణలో మాట్లాడుతున్న ఎంపిడిఒ సుజాత



గోకవరంలో మందులు పంపిణీ చేస్తున్న వైద్య సిబ్బంది

ఘనంగా ఆయుర్వేద దినోత్సవం

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం, గోకవరం

స్థానిక ఆర్ట్స్ కళాశాల బోటనీ విభాగం ఆధ్వర్యాన మంగళవారం జాతీయ ఆయుర్వేద దినోత్సవం ఘనంగా నిర్వహించారు. జిల్లా ఆయుష్ అధికారి డాక్టర్ కె.సి.హెచ్.మహేష్ ఆయుర్వేదం యొక్క ప్రాముఖ్యత, పద్ధతులపై అవగాహన కల్పించారు. మానవుల ఆరోగ్యాన్ని మెరుగుపరచడానికి ప్రకృతిసిద్ధంగా లభించే సహజ పోషకాలను రోజువారీ దినచర్యలో ఉపయోగించుకోవాలని ఆయన సూచించారు. మొక్కల నుంచి లభించే ఆయుర్వేద ఉత్పత్తులు దుష్ప్రభావాల, హాని కలిగించకుండా ఆరోగ్యాన్ని, రోగనిరోధక శక్తిని పెంచుతాయన్నారు. ప్రాచీన భారతీయ వైద్య విజ్ఞాన వ్యవస్థలో భాగంగా ఆయుర్వేదం ప్రాముఖ్యతను డిపార్ట్మెంట్ ఇన్‌ఛార్జి డాక్టర్ ఎ.శ్రీనివాసరావు వివరించారు.

గోకవరం ప్రభుత్వాసుపత్రిలో ఆయుర్వేద వైద్యాధికారి డాక్టర్ జి.కేదార్ శర్మ ఆధ్వర్యంలో జాతీయ ఆయుర్వేద దినోత్సవం నిర్వహించారు. ఆయుర్వేదం ప్రాచీన కాలం నుంచీ వస్తున్న వైద్యమని, అందరు ఈ సేవలను ఉపయోగించుకోవాలని, ఈ సంవత్సరం థీమ్ ఆయుర్వేదమ్ ప్రజలకోసం ప్రర్యావరణం కోసమని, అందుకే ప్రజలందరూ ఈ సేవలు ఉపయోగించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు ఆర్.శ్రీనివాసరావు, ఎ.అరుణ, పి.అరుణ్, హెడ్ నర్స్ విమలకుమారి, పవన్, రమణ, ప్రసాద్ పాల్గొన్నారు.

ఫ్రెషర్స్ డే వేడుకల్లో ఎంపీ పురందేశ్వరి

ప్రజాశక్తి -దేవరపల్లి

ఆనంద్ ఎడ్యుకేషనల్ సొసైటీలో ఫ్రెషర్స్ డే వేడుకల్లో రాజమహేంద్రవరం ఎంపీ దగ్గుపాటి పురందరేశ్వరి పాల్గొన్నారు. దేశ భవిష్యత్తును మార్చగల సత్తా ఉండే యువత మధ్య ఈ ఉత్సవం జరుపుకోవడం చాలా సంతోషంగా ఉందని పురందరేశ్వరి అన్నారు. తొలుత ఆమె విద్యార్థిని విద్యార్థులకు ఉపాధ్యాయులకు శరన్నవరాత్రి శుభాకాంక్షలు తెలిపారు. మెట్ట ప్రాంతమైన గోపాలపురం నియోజకవర్గంలో బడుగు బలహీన వర్గాల పిల్లలు ఉన్నత స్థాయికి ఎదగాలని ఉన్నత ప్రమాణాలతో ఈ ఎడ్యుకేషనల్ సొసైటీని స్థాపించిన జనసేన పార్టీ ఇన్‌ఛార్జి దొడ్డిగర్ల సువర్ణ రాజును ఆమె ప్రశంసించారు.

పశువులకు టీకాలు

ప్రజాశక్తి-చాగల్లు

చాగల్లు మండలంలో ఈ నెల 15వ తేదీ నుండి నేలటూరు, గౌరిపల్లి, మల్లవరం, చంద్రవరంలో పశువుల్లో గాలి కుంటు వ్యాధి నివారణకు టీకాలువేసినట్టు పశువైద్యాధికారి డాక్టర్ యు.ముకేశ్ తెలిపారు. మండలంలో మిగిలిన గ్రామాల్లో పాడి రైతులు కూడా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

పిల్లా చంటిబాబుకు ఘన సత్కారం

ప్రజాశక్తి-గోకవరం

టిడిపి మండల కన్వీనర్ పిల్లా అర్జున సారథిని కృష్ణునిపాలెం ఆర్ అండ్ ఆర్ కాలనీకి చెందిన టిడిపి నాయకులు మంగళవారం వెదురుపాకలో చంటిబాబు స్వగృహంలో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి యువ నాయకులు బత్తుల సారంగధరుడు, తంటికొండ దేవస్థాన డైరెక్టర్, వెదురుపాక మాజీ సర్పంచ్ బొట్టా రామకృష్ణ, ఆర్ అండ్ ఆర్ కాలనీ టిడిపి నాయకులు సిద్ధ సత్యనారాయణ, దేవీపట్నం సర్పంచ్ లంకపోసిరావు, లంకహరి కరిబండి విష్ణు, గేదెల చిన సుబ్బారావు, జనసేన గోకవరం నాయకులు వీరవల్లి పోసిబాబు పాల్గొన్నారు.

కొప్పుల వెలమ సంఘం కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి -గోకవరం

మండల కేంద్రమైన గోకవరంలో వెలమ సంఘం కమిటీ సభ్యులను మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ సలహాదారులుగా కొత్తల వీరా అప్పారావు, యాళ్ల నాగేశ్వరరావు, మీడియా కో ఆర్డినేటర్‌గా పైలా కిరీటి, ప్రెసిడెంట్‌గా చింతల రవికాంత్, వైస్ ప్రెసిడెంట్‌గా కోరిపల్లి అప్పలస్వామి, ఆదిరెడ్డి శ్రీనివాస్, సెక్రటరీగా రాయవరపు శ్రీనివాసరావు, జాయింట్ సెక్రటరీగా ఈదిబిల్లి కొండబాబు, కోశాధికారిగా గుడివాడ మనీష్, కమిటీ సభ్యులుగా పల్లి కన్నబాబు, చిటికెల పాండు, బొడ్డు రాజు, టమటపు కన్నబాబు, యర్రా రమేష్, గొర్రెల చిన్నబాబు, రేవాడ లోకేష్, రోంగాల రామచంద్రరావులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వెలమ సంఘం అధ్యక్షులు చింతల రవికాంత్ మాట్లాడుతూ వెలమ సంక్షేమ సంఘం అభివృద్ధికి అహర్నిశలు కష్టపడి కృషి చేస్తానని తెలిపారు.

హౌసింగ్ లేఔట్స్ పరిశీలన

ప్రజాశక్తి-పెరవలి

మండలంలోని నడిపల్లి, ముక్కామల, నల్లాకులవారిపాలెం, కొత్తపల్లి అగ్రహారం, పెరవలిలో హౌసింగ్ లే ఔవుట్స్‌ను జిల్లా హౌసింగ్ ప్రాజెక్ట్ డైరెక్టర్ నాతి బుజ్జి మంగళవారం పరిశీలించారు. అనంతరం లబ్ధిదారులను కలిసి మాట్లాడారు. ఇళ్ల నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేయాలన్నారు ఈ కార్యక్రమంలో హౌసింగ్ డిఇ టి.శేఖర్ బాబు, హౌసింగ్ ఎఇ వి.సతీష్ కుమార్, వర్క్ ఇన్‌స్పెక్టర్ జోగారావు పాల్గొన్నారు.

వైసిపి ఎస్‌సి సెల్ కార్యదర్శిగా ఫణి కుమార్

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం రూరల్

వైసిపి ఎస్‌సి సెల్ రాష్ట్ర కార్యదర్శిగా వైసిపి యువ నాయకులు విప్పర్తి ఫణి కుమార్ నియామకంపై పార్టీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు మంగళవారం ఉదయం వేమగిరి గట్టు అంబేద్కర్ పార్కు నుంచి పార్టీ కార్యకర్తలు పెద్ద ఎత్తున ఊరేగింపుగా రాజమండ్రి కేంద్ర కార్యాలయానికి తీసుకుని వెళ్లారు. జిల్లా కార్యాలయంలో మాజీ మంత్రి, పార్టీ జిల్లా అధ్యక్షుడు చెల్లుబోయిన వేణు ఫణి కుమార్‌కు స్వాగతం పలికి పలికారు. ఫణి కుమార్ మాట్లాడుతూ తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుని పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని తెలిపారు.

వెదురుపాక రహదారి పనుల ప్రారంభం

ప్రజాశక్తి-గోకవరం

మండలంలోని వెదురుపాక-బావాజీపేట మధ్య ఉన్న ప్రధాన రహదారి నిర్మాణానికి మంగళవారం టిడిపి మండల కన్వీనర్ పిల్ల అర్జున సారథి ఆధ్వర్యాన పనులు ప్రారంభించారు. ఎంఎల్‌ఎ, టిటిడి బోర్డు సభ్యుడు జ్యోతుల నెహ్రూ ఈ రహదారి నిర్మాణానికి నిధులు మంజూరు చేయించారు. ఇటీవల స్మార్ట్ రేషన్ కార్డ్ పంపిణీలో వెదురుపాకలో స్థానిక ప్రజలు వెదురుపాక ప్రధాన రహదారి కోసం ఎంఎల్‌ఎ నెహ్రూకు వినతిపత్రం అందించారు. ఎంఎల్‌ఎ నెహ్రూ స్పందించి తక్షణమే రోడ్డు పనులు ప్రారంభించే విధంగా చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. నెలరోజుల వ్యవధిలో రోడ్డు పనులు ప్రారంభించే విధంగా అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు బత్తుల సారంగధరుడు, గళ్ల రాము, బొట్టా రామకృష్ణ, వెంకటపతి, వీర అప్పారావు, బలిజ నరసింహారావు, అప్పలస్వామి, గొర్రెల శ్రీనివాస్, గొంతెన రామకృష్ణ, గొంతెన రాజు పాల్గొన్నారు.



రోడ్డు పనులు ప్రారంభిస్తున్న టిడిపి నాయకులు

అదనపు విధుల నుంచి తప్పించాలి

ప్రజాశక్తి-తాళ్లపూడి

ఇప్పటికే తమపై అనేక అదనపు విధుల భారాలు ఉన్నప్పటికీ పింఛన్లు పంపిణీ కూడా తమకు అప్పగించడంతో మరింత భారం పెరుగుతోందని అంగన్‌వాడీలు మంగళవారం ఎంపిడిఒ వేణుగోపాల రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీలు రమణ, జ్యోతి లతోపాటు వివిధ గ్రామాల నుంచి అంగన్వాడీలు పాల్గొన్నారు.

విద్యార్థులకు నైపుణ్యాభివృద్ధిపై వర్క్ షాప్

ప్రజాశక్తి -కొవ్వూరు

కొవ్వూరు ఎబిఎన్ అండ్ పిఆర్‌ఆర్ కళాశాలలో మంగళవారం రసాయన శాస్త్రం, లైఫ్ సైన్సెస్ విభాగాల్లో విద్యార్థులకు నైపుణ్య శిక్షణ అందించారు. రాజమహేంద్రవరం కందుకూరి రాజ్యలక్ష్మి కళాశాల రిసోర్స్ పర్సన్స్ డాక్టర్ ఎ.వసుందరాదేవి, డాక్టర్ ఎం.సునీత, ఎన్.స్వాతి, కళాశాల రసాయన శాస్త్ర అధిపతి డా.రమేష్ ఎల్లాప్రగడ క్లీనింగ్ పౌడర్లు, డిటర్జెంట్లు తక్కువ ఖర్చుతో కూడుకున్న గృహ సంరక్షణ ఉత్పత్తులను ఎలా తయారు చేయాలో విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఏలూరు సర్ సిఆర్‌రెడ్డి కళాశాల, కొవ్వూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల, కొవ్వూరు ఎస్‌విజె సంస్కృత కళాశాల, ఎబిఎన్, పిఆర్‌ఆర్ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

పంచాయతీ సిబ్బందికి శిక్షణా తరగతులు

ప్రజాశక్తి-బిక్కవోలు

స్థానిక మండల కార్యాలయంలో బంగారు కుటుంబాల మార్గదర్శకాలపై పంచాయతీ సిబ్బందికి మంగళవారం శిక్షణా తరగతులు నిర్వహించినట్టు పరిపాలనాధికారి విఎన్.ప్రసాద్ తెలిపారు. అందరికీ ఉదయం, మధ్యాహ్నం రెండు బ్యాచులుగా పి-4 మొబైల్ యాప్ ద్వారా బంగారు కుటుంబాలు మార్గదర్శకాలను మ్యాప్ చేయడం ఆప్షన్ అప్డేట్ చేయడం వంటి అంశాలపైన శిక్షణా తరగతులు నిర్వహించామని ఈ శిక్షణ కార్యక్రమానికి మాస్టర్ ట్రైనర్లుగా పంచాయతీ సెక్రటరీలు డి.శ్రీనివాస్, కె.సాయి అరవింద్ రెడ్డి, ఎస్.సురేష్ వ్యవహరించారని పరిపాలన అధికారి తెలిపారు. ఈ కార్యక్రమానికి 129 మంది పంచాయితీ సిబ్బంది హాజరైయాలని ఆయన తెలిపారు.

నేరాలు ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకుల మృతి

ప్రజాశక్తి - తాళ్లరేవు

మండలంలోని గాడిమొగ పంచాయతీ పెదవలసల మెయిన్‌రోడ్డు వద్ద మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు అక్కడికక్కడే మృతి చెందారు. కోరంగి పోలీసులు తెలిపిన వివరాల మేరకు..యానం నియోజకవర్గం సావిత్రి నగర్ గ్రామానికి చెందిన మచ్చ లక్ష్మీ సత్యనారాయణ(21), అదే గ్రామానికి చెందిన పాలెపు కోసరాజు(20) ఈ ప్రమాదంలో మరణించారు. ప్రమాదంలో ఇల్లంగి మణి అనే మరో వ్యక్తికి తీవ్ర గాయాలు కావడంతో తాళ్లరేవు సిహెచ్‌సికి తరలించారు. ప్రమాదానికి గల పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. కోరంగి ఎస్.ఐ. సత్యనారాయణ సంఘటన స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బస్సు అదుపు తప్పి పలువురికి గాయాలు

ప్రజాశక్తి - పెరవలి

మండలంలోని తీపర్రు ఆర్ అండ్ బి మెయిన్ రోడ్డుపై ఆర్‌టిసి బస్సు స్టీరింగ్ విరిగి బైకును బస్సు ఢీకొని పలువురికి గాయాలయ్యాయి. నరసాపురం నుండి నిడదవోలు వెళ్తున్న ఆర్‌టిసి బస్సు స్టీరింగ్ రాడ్ విరిగిపోవడంతో బస్సు అదుపుతప్పి నిడదవోలు నుండి పెరవలి వైపు బైకుపై వస్తున్న కడింపాడుకు చెందిన సలాది సత్యనారాయణను ఢీకొని రోడ్డు ప్రక్కనే ఉన్న ఇంటి లోపలికి దూసుకొని వెళ్ళింది. ఈ ప్రమాదంలో పలువురికి గాయాలయ్యాయి. గాయపడిన సత్యనారాయణను తణుకు యాపిల్ హాస్పిటల్‌కు తరలించారు.

పర్యావరణ పరిరక్షణకు కృషి

ప్రజాశక్తి - కాకినాడ

పర్యావరణ పరిరక్షణకు ప్రతీ ఒక్కరూ కృషి చేద్దామని ఐడిఎ కార్యదర్శి డాక్టర్ అడ్డాల పిలుపు నిచ్చారు. మంగళవారం ఆదిత్య డిగ్రీ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్, ఐడిఎ ఆధ్వర్యంలో 'ప్లాస్టిక్ వాడకం తగ్గించేందుకు అడుగులు వేద్దాం - కాలుష్యాన్ని నిర్మూలిద్దాం' అనే అంశంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లక్షల టన్నుల ప్లాస్టిక్ వాడుతున్నారని, కుప్పలు తెప్పలుగా పడివున్న ప్లాస్టిక్ వల్ల అనేక అనర్థాలు ఉన్నాయని అన్నారు. ప్లాస్టిక్ వాడకం తగ్గిస్తే భవిష్యత్ తరాలు ఆనందంగా ఉంటాయని అన్నారు. ఆదిత్య డిగ్రీ, పిజి కళాశాలల అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ బిఇవిఎల్.నాయుడు మాట్లాడుతూ ప్లాస్టిక్‌కు ప్రత్యమ్నాయంగా జనపనార సంచులను వినియోగించాలని సూచించారు. ఈ కార్యక్రమాన్ని నిర్వహించిన ఎన్‌ఎస్‌ఎస్ బృందాన్ని ఆదిత్య విద్యాసంస్థల ఛైర్మన్ డాక్టర్ నల్లమిల్లి శేషారెడ్డి, డిగ్రీ కళాశాలల సెక్రెటరీ డాక్టర్ నల్లమిల్లి సుగుణారెడ్డి అభినందించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ సత్యనారాయణ, క్యాంపస్ ఇన్‌ఛార్జ్ మూర్తి, ఎన్‌ఎస్‌ఎస్ పిఒలు టి.తేజేశ్వరరావు, డి.అశ్విని, ఐడిఎ సభ్యులు, వాలంటీర్లు పాల్గొన్నారు.

ప్రజలను ఇబ్బందులు కలిగేలా వ్యవహరిస్తే చర్యలు

ప్రజాశక్తి - అమలాపురం

బుధవారం రాత్రి ఒజి సినిమా విడుదల సందర్భంగా అభిమానులు ప్రజలకు ఇబ్బందులు కలిగించేలా సైలెన్సర్లు తీసి రోడ్లపై విచ్చలవిడిగా తిరిగితే చర్యలు తప్పవని పట్టణ సిఐ వీరబాబు హెచ్చరించారు. అమలాపురంలో ఫ్యాన్స్‌తో మంగళవారం తన కార్యాలయంలో సమావేశాన్ని సిఐ ఏర్పాటు చేశారు. దయచేసి ఎవరు విచ్చలవిడితనాన్ని ప్రదర్శించకుండా సినిమా వీక్షించాలని ఆయన కోరారు. ఈ విషయంలో ఫ్యాన్స్ తమకు సహకరించాలన్నారు. తప్పనిసరిగా తాము పోలీసులకు సహకరిస్తామని నాయకులు నల్లా చిట్టిబాబు, నల్లా నాయుడు, ఏడిద శ్రీను, సుదా చిన్నా, గుర్రాల కన్నా, ఆర్ డి ఎస్ ప్రసాద్, ముద్రగడ తదితరులు హామీ ఇచ్చారు. ఎట్టి పరిస్థితి లో డిజె బాక్సులు అనుమతించమని సిఐ స్పష్టం చేశారు.

శాంతి భద్రతలకు సహకరించాలి

కొత్తపేట: పవన్ కళ్యాణ్ నటించిన 'ఓజీ' సినిమా విడుదల రోజున అభిమానులు మరియు ప్రజలు శాంతిభద్రతలకు సహకరించాలని రావులపాలెం రూరల్ సిఐ సి.హెచ్. విద్యాసాగర్ తెలిపారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ 'ఓజీ' సినిమా విడుదల సందర్భంగా అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశామన్నారు. సమావేశంలో ఎస్.ఐ జి. సురేంద్ర పాల్గొన్నారు.

మెడికల్ కాలేజీల ప్రయివేటీకరణతో పేద విద్యార్థులకు నష్టం

ప్రజాశక్తి - అమలాపురం

ప్రభుత్వ మెడికల్ కళాశాలలను ప్రయివేటీకరణ చేయడంతో పేద విద్యార్థులు తీవ్రంగా నష్టపోతారని ఎపిఎస్‌సి వెల్ఫేర్ జిల్లా అధ్యక్షులు నకుల రాజు అన్నారు. జిల్లా కార్యవర్గ సమావేశం మంగళవారం త్రిరత్న బుద్ధ విహార్ నందు ఆయన ఆధ్వర్యంలో జరిగింది. సమావేశంలో నాయకులు ప్రభుత్వ మెడికల్ కళాశాలల ప్రయివేటీకరణను సమావేశం తీవ్రంగా వ్యతిరేకించారు. సంఘ సర్వసభ్య సమావేశాన్ని అక్టోబర్ నెల రెండవ శనివారం నిర్వహించాలని తీర్మానించారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి గోసంగి బంగార్రాజు, ఆర్థిక కార్యదర్శి సాధనాల సత్యనారాయణ, ఎం.రవి, బి.రమేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

వర్షానికి కూలిన పెంకుటిల్లు

ప్రజాశక్తి - సామర్లకోట

గత కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాలకు సామర్లకోటలో పెంకుటిల్లు కుప్పకూలింది. ఆ ఇంటిలో నివసిస్తున్న కుటుంబానికి తృటిలో ప్రమాదం తప్పింది. బాధితులు, స్థానిక కౌన్సిలర్ నేతల హరిబాబు తెలిపిన వివరాలు ప్రకారం...పట్టణ పరిధిలోని 13వ వార్డులో ఎడ్ల కోటయ్య, ఎడ్ల నూకమణి, ఎడ్ల శ్రీను పెంకుటింటిలో నివాసం ఉంటున్నారు. ఇటీవల కురుస్తున్న వర్షాలకు గోడలు పూర్తిగా తడిచి పోయాయి. దీంతో సోమవారం రాత్రి కుటుంబమంతా నిద్రకు సిద్ధమవుతుండగా ఇంటిపై కప్పుతో పాటు సగానికి పైగా ఇల్లు కూలిపోయింది. ఆ సమయంలో దంపతులు ఇంట్లోనే ఉండగా ఇంటి పైభాగం కూలుతున్నట్లు శబ్దం వినిపించడంతో కుటుంబీకులు వెంటనే బయటకు పరుగులు తీసి ప్రాణాలను కాపాడుకున్నారు. అయితే తమకు ఇల్లు కట్టుకునే స్థోమత లేకనే పాత ఇంట్లో ఉంటున్నామని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి తమకు న్యాయం చేయాలని కుటుంబీకులు కోరారు.

దసరా ఉత్సవాలకు పటిష్ట భద్రత

ప్రజాశక్తి - అమలాపురం

దసరా నవరాత్రి ఉత్సవాలల్లో అవాంఛ నీయ సంఘటనలకు తావు లేకుండా పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టాలని ఆర్‌డిఒ కె. మాధవి అన్నార. ఈ సందర్భంగా లైన్ డిపా ర్ట్మెంట్ అధికారులు, ఉత్సవ కమిటీ పెద్దలు సమ న్వయం వహించాలని సూచించారు. మంగళవారం స్థానిక ఆర్‌డిఒ కార్యాలయం నందు డివిజనల్ అధికారులు ఉత్సవ ప్రతినిధులతో పీస్ కమిటీ సమావేశం నిర్వ హించి భద్రతాపరమైన చర్యలపై సమీ క్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మతపరమైన, ఉద్యమ అవాంఛనీయ సంఘటనలు పర్యవేక్షించేందుకు వీలుగా ఏడు వీధులలో ఏడు డ్రోన్ కెమెరాలను ఏర్పాటుచేసి స్థానిక గడియారపు స్తంభం వద్ద కమాండ్ కంట్రోల్ రూమ్ కు డ్రోన్లను అనుసంధానం చేస్తూ మొత్తం ప్రక్రియను పర్యవేక్షిస్తా రన్నారు. ప్రధానంగా ఉత్సవాల నిర్వహించే ఏడు వీధులలో ఉత్సవ విగ్రహ ఊరేగింపులకు సంబంధించిన అడ్డంకులను కమిటీ పెద్దలు సూచిస్తే వాటిని అధికారులు ముందుగా తొలగిస్తారన్నారు. అమలాపురంలో విజయదశమి రోజున జరిపే చెడి తాళిం ఖానా ఉత్సవాలు కోనసీమ ప్రాంతానికి చెందిన అత్యంత ప్రాచీన వేడుకలలో ఒకటని అన్నారు. ఈ ఉత్సవాలకు ట్రాఫిక్ ఆంక్షలు, భద్రతా చర్యలు ప్రత్యేకంగా ఏర్పాటు చేయాలని ఆర్‌డిఒ అధికారులను ఆదేశించారు. పూర్తి శాంతి భద్రతల నడుమ శాంతి యుతంగా ఎటువంటి సంఘర్షణలకు తావు లేకుండా దసరా ఉత్సవాలు సజావుగా నిర్వహించాలని ఆమె సూచించారు.ఈ సమావేశంలో సిఐలు పి.వీరబాబు, డి.ప్రశాంత్‌కుమార్, ఎస్‌ఐలు, మున్సిపల్ కమిషనర్ వి.నిర్మల్ కుమార్, తహశీల్దార్ అశోక్ ప్రసాద్, ఉత్సవ కమిటీ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థి వైద్య ఖర్చులకు సాయం

ప్రజాశక్తి - అమలాపురం రూరల్

స్థానిక మండల పరిధిలోని జనుపల్లి గ్రామానికి చెందిన జాన్ పాటి విజయ్‌కుమార్ వైద్య ఖర్చులకు అన్ని విధా ల సహాయం అందిస్తానన్లి కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ హామీ ఇచ్చారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు.అల్లవరం మండలం గోడి గ్రామం లో అంబేద్కర్ గురుకుల కళాశాల నందు జూనియర్ ఇంటర్ బైపిసి చదువుతున్నాడని ఈ నెల 19న హాస్టల్ పై భాగంలో ఆరబెట్టిన బట్టలను తీసుకువచ్చే క్రమంలో కళ్ళు తిరిగి మేడ పై నుంచి కిందికి ప్రమాదవశాత్తు జారిపడ్డాడని అన్నారు. వెంటనే కళాశాల ప్రిన్సిపల్ నక్క శ్రీనివాసరావు, విజయ్ కుమార్ తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చి తోటి ఉపాధ్యాయుల తో స్థానిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్ నందు ప్రాథమిక వైద్య చికిత్స కొరకు తీసుకుని వెళ్ళగా అక్కడ వైద్యులు వైద్య పరీక్షలు నిర్వహించి చాతి భాగంలో బాగా గాయం అయిందని వెంటనే మెరుగైన వైద్యం కొరకు కాకినాడ జిజిహెచ్ కు తీసుకుని వెళ్లాలని సిఫార్సు చేశారన్నారు. తల్లి దండ్రులు దగ్గరగా ఉంటుందని భావనతో స్థానిక కిమ్స్ ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తీసుకుని వెళ్లారన్నారు. ఐసిఐసిఐ లాంబార్డ్ గ్రూపు ఇన్సూరెన్స్ జిల్లా వ్యాప్తంగా అన్ని వసతి గృహాలకు వర్తింపచేయడం జరిగిందని దీనిలో భాగంగా విజయ్ కుమార్‌కు రూ.50వేలు ఇన్సూరెన్స్ రూపంలో వైద్యం నిమిత్తం మంజూరు చేశామన్నారు. ప్రస్తుతం కిమ్స్ ఆస్పత్రి నందు బాధితుడు విజయ్ కుమారు ఎన్‌టిఆర్ వైద్య సేవ పొందుతున్నాడన్నారు.విజయ్ కుమార్ కోలుకో వడానికి రెండు నెలలు సమయం పడుతుందని వైద్యులు ధ్రువీకరించారని కలెక్టర్ తెలిపారు.

అందరి భాగస్వామ్యంతో 'జస్టిస్ ఫర్ ఆల్'

ప్రజాశక్తి - ముమ్మిడివరం

అందరి భాగస్వామ్యంతో సృజనాత్మక న్యాయ సేవలను అందించడమే జస్టిస్ ఫర్ ఆల్ త్రో ద లైన్స్ ఆఫ్ లీగల్ ఎయిడ్ అనే ఏకీకృత అంశంపై జాతీయ ఫోటోగ్రఫీ, ఆర్ట్ షో కేసు కార్యక్రమానికి శ్రీకారం చుట్టామని మండల్ లీగల్ సర్వీసెస్ కమిటీ చైర్మన్ మరియు జూనియర్ సివిల్ జడ్జి మహమ్మద్ రహంతుల్లా మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కాక్షిదారులకు న్యాయ సహాయక సేవల ద్వారా అందే సృజనాత్మక సేవలను విస్తృతంగా ప్రజల్లోకి వెళ్లడమే జస్టిస్ ఫర్ ఆల్ కార్యక్రమం ఉద్దేశ్యమని తెలిపారు. దీనిలో భాగంగా ఆసక్తి కలిగి ఆయా రంగాలలో ప్రతిభావంతుల నుండి ఫోటోలు, పెయింటింగ్స్, స్కెచ్ పెయింట్స్, అలాగే ఒక నిమిషం గరిష్ఠ నివిడి గల షార్ట్ వీడియోలను స్వీకరిస్తున్నామన్నారు. ఈ పోటీలలో పాల్గొను ఆసక్తి గలవారు అక్టోబర్ ఒకటో తేదీ గడువు లోపు తమ దరఖాస్తులను మండల్ లీగల్ సర్వీసెస్ కమిటీ కార్యాలయం ముమ్మిడివరం వారికి అందజేయాలన్నారు. మండల న్యాయ సేవాధికార సంస్థకు అందిన ప్రతులను స్కానింగ్ చేసి జిల్లా న్యాయాధికారి సంస్థకు పంపుతామన్నారు. ఉత్తమ కతులను జాతీయ స్థాయి ప్రదర్శనకు ఎంపిక చేస్తామని మేజిస్ట్రేట్ తెలిపారు.



వేగాయమ్మపేటలో పొలంపిలుస్తోంది కార్యక్రమంలో పాల్గొన్న మణిదీప్

ఎరువులు, పురుగు మందుల వినియోగాన్ని తగ్గించాలి

ప్రజాశక్తి - రామచంద్రపురం

రైతులు తొలకరి వరి చేలలో ఎరువులు పురుగుమందులు వాడకం తగ్గించాలని మండల వ్యవసాయఅధికారి మణిదీప్ సూచించారు. వేగాయమ్మపేటలో మంగళ వారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రైతులు అందరు తప్పనిసరిగా ఎరువులు వాడకం తగ్గించాలని, ప్రకృతి వ్యవసాయం వైపు మొగ్గు చూపాలని తెలియజేశారు. అవసరం మేరకు పురుగు మందులు, ఎరువులు వాడాలన్నారు. వరి కంకి నల్లి అనే సూక్ష్మ పురుగు, ఇది వరి మొక్కల ఆకుల పైపొరలను , పానికల్స్‌పై దాడి చేస్తోందన్నారు. ఆకు తొడుగులపై దాల్చిన చెక్క లేదా చాక్లెట్-గోధుమ రంగు మచ్చలు కనిపిస్తాయని అన్నారు. ఈ దశలో పురుగులు గింజలను తింటాయని, దీనితో పంట దిగు బడి తగ్గుతుందని అన్నారు. గింజలు వంకరగా మోపుబోతున్నట్లు ఆకారం మార్చుకుంటాయని అన్నారు. మొక్కలు నిర్జీవంగా మారతాయన్నారు. నిరోధక విధానాలు పంటలో నీటిని నింపడం ద్వారా పురుగులను పైకి వచ్చేటట్లు చేయడం సహజ శత్రువులను హానిచేయకుండా రసాయన నియంత్రణ కోసం హెక్సిథయాజాక్స్ సల్ఫర్ కాంపౌండ్లు వాడటం కెమికల్ కంట్రోల్‌లో రైతులందరూ నానో ఫెర్టిలైజర్ బయో ఫెర్టిలైజర్ వినియోగించాలన్నారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు, ప్రజా ప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

పాణింగపల్లిలో పొలం పిలుస్తోంది

కె.గంగవరం మండలం పాణింగపల్లి సత్యవాడ గ్రామాల్లో మంగళవారం మండల వ్యవసాయ అధికారి సద్గురు మూర్తి పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ సెప్టెంబర్ 30 నాటికి రైతులందరూ ఈ పంట నమోదు సంబంధిత రైతు సేవా కేంద్రాల్లో తప్పకుండా పూర్తి చేసుకోవాలని కోరారు. అలాగే ప్రస్తుతం వర్షాలు మరియు ఎండ ఉక్కపోత వాతావరణం కలిసి ఉన్న నేపథ్యంలో వరిలో బ్యాక్టీరియా ఆకు ఎండు తెగులు వచ్చే అవకాశం ఉందన్నారు. దీని నివారణ మేరకు నత్రజని ఎరువులు వేయటం ఆపి నీరు తీసి మళ్ళీ పెట్టుకుని ఆవు మూత్రాన్ని అయిదు మిల్లీలీటర్ చొప్పున లీటర్ నీటికి పిచికారీ చేసుకోవాలని తెలియ జేశారు. కార్యక్రమంలో పాణింగపల్లి సర్పంచ్ చీకట్ల గోపాలం, సత్యవాడ సర్పంచ్ సలాది వెంకన్న, విఎఎలు సాయి శ్రీ, ప్రియాంక, రైతులు పాల్గొన్నారు.

ఎఎన్‌ఎంపై దాడి చేసిన వారిని అరెస్టు చేయాలి

ప్రజాశక్తి - సఖినేటిపల్లి

ఎఎన్‌ఎంపై దాడిచేసిన వారిని తక్షణం అరెస్ట్ చేయాలని మానవ హక్కుల వేదిక బృందం డిమాండ్ చేసింది. మలికిపురం మండలం పడమటిపాలెం పిహెచ్‌సిలో విధులు నిర్వహిస్తున్న ఎఎన్‌ఎం కందికట్ల రత్నకుమారిపై జరిగిన దాడి విషయమై ఐదుగురు సభ్యుల మానవ హక్కుల వేదిక బృందం గ్రామంలో మంగళవారం నిజ నిర్ధారణ చేపట్టింది. దాడికి పాల్పడిన నిందితులు రేకపల్లి దొరబాబు, అడబాల వెంకట నాగ సత్యవతిలను అరెస్టు చేయడంలో పోలీసులు తాత్సారం చేస్తున్నారని అన్నారు. నిందితులకు స్థానిక జనసేన రాజకీయ నాయకుల అండదండలుండడమే దీనికి కారణమని వేదిక సభ్యులు ఆరోపించారు. అయితే ఇంతవరకు పోలీసులు నిందితులను అరెస్టు చేయలేదన్నారు. ఈ లోపు జనసేన నాయకులు, కార్యకర్తలు బాధితురాలే విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించారని, దానితో చంటిబిడ్డ అస్వస్థతకు గురైందని తప్పుడు ప్రచారం చేస్తున్నారన్నారు. వీరిపై కూడా చట్టపరమైన చర్యలు తీసుకోవాలని మానవ హక్కుల వేదిక నాయకులు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వై.రాజేష్, రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎ.రవి, జిల్లా అధ్యక్షులు ఎం.ఇక్బాల్, జిల్లా కార్యవర్గ సభ్యులు ముత్యాల శ్రీనివాసరావు, పెయ్యల సత్యనారాయణ పాల్గొన్నారు.

రేపు కెపాసిటీ బిల్డింగ్‌పై అవగాహన

ప్రజాశక్తి - ముమ్మిడివరం

స్థానిక నగర పంచాయతీ పరిధిలో డిఎల్‌ఎఫ్ ఫంక్షన్ హాల్ నందు గురువారం నగర పంచాయతీ ఛైర్మన్ కమిడి ప్రవీణ్ కుమార్ అధ్యక్షతన జరిగే స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా కెపాసిటీ బిల్డింగ్‌పై జరిగే అవగాహనా, శిక్షణా సదస్సు నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి ఎంఎల్‌ఎ దాట్ల సుబ్బరాజు ముఖ్య అతిథిగా పాల్గొంటరని కమిషనర్ రవివర్మ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సదస్సును వాష్‌ఇన్‌స్టిట్యూట్, సహాస్ సంస్థల సౌజన్యంతో నిర్వహిస్తున్నామని ఆయన అన్నారు. ఈ సదస్సుకు కౌన్సిలర్లు కో ఆప్టేడ్ సభ్యులు విధిగా హాజరు కావాలని ఆయన కోరారు.

సమస్యలు పరిష్కరించాలని నల్లబ్యాడ్జీలతో నిరసన

ప్రజాశక్తి - మామిడికుదురు

తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సచివాలయ ఉద్యోగులు మంగళవారం నల్ల బ్యాడ్జీ లతో మామిడి కుదురు మండల పరిషత్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. ఇంటింటా సర్వేలు, ఇతర పనుల నుంచి తమకు విముక్తి కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వము తమ ఆత్మగౌరవాన్ని దిగజార్చు నిర్ణయాలు తీసుకుంటుందని ఆవేదన వ్యక్తం చేశారు. న్యాయం పరమైన సమస్యలు తక్షణమే పరిష్కరించాలని వారు ప్రభుత్వానికి విన్న వించారు.

ద్రాక్షారామం గ్రామ పంచాయతీ సాధారణ సమావేశం

ప్రజాశక్తి - రామచంద్రపురం

ద్రాక్షారామ గ్రామపంచాయతీ సాధరణ సమావేశం మంగళవారం నిర్వహించారు. ముందుగా ఇటీవల మృతి చెందిన జడ్‌పిటిసి సభ్యుడు మేర్నీడి వెంకటేశ్వరరావుకు పాలకవర్గం నివాళులు అర్పించారు. సమావేశంలో పారిశుధ్య కార్మికులు, డ్రైవర్లు, పంచాయితీ సిబ్బంది జీతాలు పెంచుటకు, పంచాయతీలో పని చేస్తున్న పారిశుధ్య కార్మికులకు, డ్రైవర్లుకు, పంచాయతీ సిబ్బందికి ఇన్సూరెన్స్ చేయించుటకు, పంచాయతీ పరిధిలోని స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమంలో భాగంగా స్పెషల్ శానిటేషన్ పనులు గ్రామ పరిధిలో చేయుటకు, గ్రామంలోని లేఔట్ ఒకట, రెండు, మూడు, నాలుగు లలో అవ సరమైన ఎలక్ట్రికల్ పనులు, పారిశుధ్య పనులు చేయుటకు పాలకవర్గం తీర్మానించారు.గ్రామ సర్పంచ్ కొత్తపల్లి అరుణ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో వార్డు సభ్యులు పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

వైసిపి జిల్లా అధ్యక్షుడు జగ్గిరెడ్డిని కలిసిన రామారావు

ప్రజాశక్తి - అయినవిల్లి

వైసిపి రాష్ట్ర బూత్ కమిటీ వింగ్ సెక్రెటరీగా నియమితులు అయిన చెట్ల రామారావు మం గళవారం వైసిపి జిల్లా అధ్యక్షులు చిర్ల జగ్గిరెడ్డిని, రాజోలు నియోజకవర్గం కో ఆర్డినేటర్, మాజీ మంత్రి వర్యులు గొల్లపల్లి సూర్యారావును మర్యాదపూర్వకంగా కలిశారు. గోలపాలపురం వారి క్యాంప్ ఆఫీస్‌లో జగ్గిరెడ్డిని సన్మానించారు. కార్యక్రమంలో మార్గాన్ని గంగాధరం,మండపేట నియోజకవర్గం పరిశీలకులు కరకంశెట్టి ఆదిత్య, మానేపల్లి గ్రామ వైస్ ప్రెసిడెంట్ ఉండ్రాజవరపు దుర్గారావు, పి.గన్నవరం మండల విద్యార్థి విభాగ అధ్యక్షుడు కొండేటి సురేష్ బాబు, కె.జగన్నాథపురం తదితరులు పాల్గొన్నారు.



జగ్గిరెడ్డితో చెట్ల రామారావు తదితరులు

పని గంటల పెంపుదలకు వ్యతిరేకంగా ధర్నా

ప్రజాశక్తి - కాకినాడ, పెద్దాపురం

కార్మికులకు వ్యతిరేకంగా కూటమి ప్రభుత్వం చేసిన పని గంటల పెంపుదలకు వ్యతిరేకంగా సిఐటియు ఆధ్వర్యంలో కాకినాడలో ధర్నా జరిగింది. మంగళవారం స్థానిక జ్యోతిరావు పూలే విగ్రహం సిఐటియు ఆధ్వర్యంలో జరిగిన ఈ ధర్నాలో సిఐటియు నగర కన్వీనర్ మలకా వెంకటరమణ, కో కన్వీనర్ పలివెల వీరబాబు, మేడిశెట్టి వెంకటరమణ మాట్లాడారు. 8 గంటల పని విధానం కోసం 140 సంవత్సరాల క్రితమే కార్మిక వర్గం పెద్ద ఎత్తున ఉద్యమించిందన్నారు. ఫలితంగానే 8 గంటల పని విధానం అమలులోకి వచ్చిందని గుర్తు చేశారు. ఇందుకోసం ఎందరో కార్మికులు ప్రాణ త్యాగాలు చేశారని అన్నారు. అందుకు ప్రతిఫలంగా వచ్చిన 8 గటల పని విధానం ప్రపంచవ్యాప్తంగా కొనసాగుతూ వస్తుందన్నారు. అయితే కూటమి ప్రభుత్వం పని గంటలను పెంచుతూ 12 గంటల నుంచి 13 గంటల వరకూ కార్మికులతో పని చేయించుకోవచ్చని రాష్ట్ర అసెంబ్లీ తీర్మానం చేయడం కార్మిక వర్గానికి ద్రోహం చేయడమేనని అన్నారు. పని గంటల పెంపుదల వల్ల తీవ్రమైన నిరుద్యోగ సమస్య ఏర్పడుతుందన్నారు. ఈ పని గంటల పెంపుదల వల్ల మరింతగా నిరుద్యోగం పెరుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. మహిళా కార్మికులను రాత్రిపూట డ్యూటీ చేయించుకోవచ్చని చెప్పడం ఎంతవరకు సమంజసం అని ప్రశ్నించారు. పగటి పూటే మహిళలకు రక్షణ లేకపోతే రాత్రిపూట రక్షణ ఎవరు కల్పిస్తారని నిలదీశారు. పని గంటల పెంచిన ప్రభుత్వం వేతనాలు ఎందుకు పెంచలేదన్నారు. 15 ఏళ్ళగా కనీస వేతనాల సవరణ చేయని పాలకులు కార్మికుల శ్రమను పెట్టుబడిదారులకు దోచిపెట్టేందుకు పని గంటలను పెంపుదల చేసిందన్నారు. తక్షణమే కనీస వేతనాల సవరణ చేసి కార్మికుల వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో కార్మిక వర్గ ఆగ్రహానికి కూటమి ప్రభుత్వం గురికాక తప్పదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎపిఎంఎస్‌ఆర్‌యు నాయకులు సిహెచ్ వెంకట్రావు, శ్రీనివాస్, తలుపులమ్మ, శేఖర్, రాజు, శ్రీను, లక్ష్మి, జ్యోతి, దుర్గ తదితరులు పాల్గొన్నారు. అలాగే పెద్దాపురం సిఐటియు మండల కమిటీ ఆధ్వర్యంలో స్థానిక మండల రెవెన్యూ కార్యాలయం వద్ద ధర్నా జరిగింది. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి డి.క్రాంతికుమార్ మాట్లాడారు. పని గంటల పెంపుదల దుర్మార్గమని అన్నారు. ఇప్పటికే రాష్ట్రంలో నిరుద్యోగం పెరిగిపోతుందని, తక్షణమే అసెంబ్లీలో ఆమోదించిన తీర్మానాన్ని తక్షణమే విరమించుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం తహశీల్దార్‌కు వినతిపత్రాన్ని అంద జేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు అధ్యక్షులు గడిగట్ల సత్తిబాబు, ప్రయివేట్ ఎలక్ట్రికల్ వర్కర్స్ యూనియన్ గౌరవాధ్యక్షులు చింతల సత్యనారాయణ, పాండవ గిరి పెయింటింగ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు వడ్డి సత్యనారాయణ, అంగన్‌వాడీ యూనియన్ ప్రాజెక్ట్ అధ్యక్షురాలు టిఎల్.పద్మ, నాయకులు పాల్గొన్నారు.